ప్రజాశక్తి

ఆదివారం 22 సెప్టెంబర్ 2024

రైఫిల్ షూటింగ్‌లో 'శ్రీచైతన్య' విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని కోర్టు రోడ్డులో ఉన్న శ్రీచైతన్య పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న వి.తీక్షణ్‌సాయి అత్యున్నత ప్రతిభ కనబరిచాడు. ఇటీవల రామ్‌నగర్‌లోని ఆర్యన్ షూటింగ్ స్పోర్ట్స్ అకాడమీలో జరిగిన అండర్–14 రైఫిల్ షూటింగ్ పోటీల్లో తీక్షణ్‌సాయి సిల్వర్ మెడల్ సాధించాడు. శనివారం స్పోర్ట్స్ మీట్ సందర్భంగా స్థానిక పాఠశాలలో విద్యార్థిని పాఠశాల నిర్వాహకులు, ఉపాధ్యాయులు అభినందించారు. స్థానిక కోర్ట్ రోడ్ లోని శ్రీ చైతన్య పాఠశాల ప్రాంగణంలో స్పోర్ట్స్ మీట్ సందర్భంగా శ్రీ చైతన్య పాఠశాల ఏజీఎం సుబ్బారెడ్డి, ప్రిన్సిపల్ తబస్సుమ్ చేతుల మీదుగా తీక్షన్‌సాయి ప్రశంసా పత్రాన్ని అందుకున్నాడు. ఈ కార్యక్రమంలో ఆర్యన్ షూటింగ్ స్పోర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకులు శ్రీకాంత్, శ్రీచైతన్య పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మెడల్, ప్రశంసాపత్రం అందుకుంటున్న తీక్షణ్‌సాయి

సమసమాజ దార్శనికుడు గురజాడ

గురజాడ జయంతి వేడుకల్లో విశ్రాంత ఆచార్యులు రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

ఆధునిక సమసమాజ స్థాపనకు తన సాహిత్యంతో ప్రజా చైతన్యం నింపిన సంఘసంస్కర్త, రచయిత గురజాడ అప్పారావు సమసమాజ దార్శనికుడని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, విశ్రాంత ఆచార్యులు రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. శనివారం అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా), ఎస్ ఎస్ బి ఎన్ తెలుగు శాఖ, మహిళ సాధికారత సంయుక్త ఆధ్వర్యంలో గురజాడ అప్పారావు 162 జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎస్ ఎస్ బి ఎన్ సెమినార్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి, ఎస్ఎస్‌బిఎన్ కళాశాల కార్యదర్శి కే నిర్మలమ్మ, ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు డాక్టర్ అంకే శ్రీనివాసులు, ఎస్ఎస్‌బి ఎన్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ దేవకి, ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి సావిత్రి, రచయిత షేక్ రియాజుద్దీన్, ఐద్వా జిల్లా కోశాధికారి చంద్రిక, ఉపాధ్యక్షురాలు రామాంజనమ్మ, మహిళా సాధికారత మాధవి తదితరులు హాజరయ్యారు. ఈసందర్భంగా గురజాడ అప్పారావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కళాశాల వైస్ ప్రిన్సిపాల్ దేవకి అధ్యక్షతన విద్యార్థులతో నిర్వహించిన సెమినార్‌లో రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఆధునిక తెలుగు సాహిత్య చరిత్రకు పునాది వేసిన గురజాడ అప్పారావు మానవాళి ఎదుర్కొంటున్న రుగ్మతలు అసమానతలు అప్పట్లోనే చాటి చెప్పిన గొప్ప దార్శనికుడని అన్నారు. 162 సంవత్సరాల క్రితం పుట్టిన గురజాడ సాహిత్యం నేటి సమాజానికి ఎంతో ఉపయోగకరంగా ఉందని తెలిపారు. సమాజంలో స్త్రీపురుష సమానత్వాన్ని ఆయన కోరుకున్నాడని అన్నారు. అనేక ఆరోగ్యకరమైనటువంటి ఆలోచన రేకెత్తించిన అప్పారావు సాహిత్యాలను మనమందరం అధ్యయనం చేయాలని, నేర్చుకోవాలని, ఆచరించాలని పిలుపునిచ్చారు. ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు శ్రీనివాసులు మాట్లాడుతూ వంద సంవత్సరాల క్రితమే కార్పొరేట్ విద్యావ్యవస్థ, సమాజాన్ని దోపిడీ చేస్తుందని ప్రశ్నించిన గొప్ప సంస్కర్త అని కొనియాడారు. ఎస్ ఎస్ బి ఎన్ కళాశాల సెక్రటరీ కె నిర్మలమ్మ మాట్లాడుతూ చరిత్ర లిఖించిన వారిలో గురజాడ ఒకరు అన్నారు. ఎస్ఎస్‌బిఎన్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ దేవకి మాట్లాడుతూ మహిళా హక్కుల కోసం మహిళా అభివృద్ధి కోసం గురజాడ విశేష కృషి చేశారన్నారు. విద్యార్థులు గురజాడను చదివి భావి భారత పౌరులుగా ఎదిగి దేశ సేవకు సమాజ సేవకు కషి చేయాలని పిలుపునిచ్చారు. ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి మాట్లాడుతూ సమాజంలో రుగ్మతల రూపుమాపేందుకు గురజాడ సాహిత్యం ఎంతో తోడ్పడిందన్నారు. సాంకేతికంగా అభివద్ధి చెందిన ఈ రోజుల్లో కూడా మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ప్రాణాలు కాపాడే వైద్యురాలకే ప్రాణాపాయం తలపించే దుష్ట చర్యలు చోటు చేసుకోవడం బాధాకరం అన్నారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వాలు కషి చేయాలని సమాజం కూడా సహకరించాలని కోరారు. ఎస్ ఎస్ బి ఎన్ అధ్యాపకులు నగరూరి రసూల్ మాట్లాడుతూ వంటగదిగే పరిమితమైన మహిళ నేడు రాకెట్ నడిపే స్థాయికి ఎదిగారంటే నాడు గురజాడ లాంటివారు సమాజాన్ని చైతన్యం పరిచినందుకే సాధ్యమైందని అన్నారు. ఉమెన్ ఎంపవర్మెంట్ మాధవి మాట్లాడుతూ మంచి పౌరులుగా తయారు కావాలంటే గురజాడ సాహిత్యాన్ని చదవాల్సిన అవసరం ఉందని తెలిపారు.

ఉత్కంఠభరితంగా దులీప్ ట్రోఫీ పోటీలు

సెంచరీకి చేరువలో తెలుగు తేజం
అర్ధ సెంచరీ చేసిన శ్రేయస్ అయ్యర్
బ్యాటింగ్‌లో రాణించిన పరాగ్, రావత్

ప్రజాశక్తి - అనంతపురం

అనంతపురం క్రీడాగ్రామంలో జరుగుతున్న దులీప్ ట్రోఫీ ఆఖరి మ్యాచులు రసవత్తరంగా మారాయి. మూడవ రోజు ఆటలో భాగంగా శనివారం ఇండియా – బీ తో జరిగిన మ్యాచ్‌లో ఇండియా – డి జట్టు ఆటగాడు రిక్కీ భుయ్ మెరుపు ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. మరో పది పరుగులు చేస్తే టోర్నీలో రెండో సెంచరీకు చేరువకానున్నాడు. ఇండియా – డీ జట్టు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ అర్ధ సెంచరీ చేశాడు. ఇండియా– బీ జట్టులో ఆల్‌రౌండ్ వాషింగ్‌టన్ సుందర్ అర్ధ సెంచరీ చేశాడు. ఇండియా– సీతో జరిగిన మరో మ్యాచ్‌లో ఇండియా– ఏ జట్టు క్రీడాకారులు రియాన్ పరాగ్, శాశ్వత్‌రావత్ అర్ధ సెంచరీలతో రాణించారు. ఆదివారం చివరి రోజు ఆట జరగనుంది.

రిక్కీ భుయ్ మెరుపు ఇన్నింగ్స్.. ఇండియా డీ 244/5

ఇండియా డీ జట్టు క్రీడాకారుడు రిక్కీభుయ్ రెండో ఇన్నింగ్స్‌లో మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. వన్‌డౌన్‌లో వచ్చిన ఆంధ్ర కుర్రాడు చూడచక్కని షాట్లతో ప్రేక్షకులను అలరించాడు. కేవలం 87 బంతుల్లో 10 ఫోర్లు, 3 భారీ సిక్సర్ల సహాయంతో 90 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో ఉన్నాడు. రిక్కీ భుయికి తోడుగా కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ 50 (7 ఫోర్లు, ఒక సిక్సర్), సంజు సామ్సన్ 45 (5 ఫోర్లు, 2 సిక్సర్లు) రాణించారు. దేవదత్ పడిక్కిల్ 3, శ్రీకర్ భరత్ 2 పరుగులతో నిరాశపరిచ్చారు. దీంతో ఆటముగిసే సమయానికి ఇండియా– డీ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు కోల్పోయి 244 పరుగులు చేసింది. ఇండియా– బీ బౌలర్లు ముకేష్ కుమార్ 3, నవదీప్‌శైనీ 2 వికెట్లు తీసుకున్నారు. అంతకుముందు ఉదయం ఓవర్‌నైట్ స్కోర్ 210/6తో ప్రారంభించిన ఇండియా– బీ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 282 పరుగులకు ఆలౌట్ అయ్యింది. జట్టులో వాషింగ్‌టన్ సుందర్ 82 (7 ఫోర్లు, ఒక సిక్సర్) పరుగులు చేశాడు. ఇండియా– డీ జట్టు బౌలర్లలో సౌరభ్‌కుమార్ 5, అర్షదీప్ సింగ్ 3, ఆదిత్యథాక్‌రే 2 వికెట్లు తీసుకున్నాడు. ప్రస్తుతం ఇండియా–డీ జట్టు 311 పరుగుల ఆధిక్యతతో ఉంది.

ఆకట్టుకున్న పరాగ్, శాశ్వత్ రావత్.. ఇండియా- ఏ 270/6

మరో మైదానంలో ఇండియా – ఎ, ఇండియా – సిజట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్‌లో ఇండియా ఏ క్రీడాకారులు రియాన్ పరాగ్, శాశ్వత్ రావత్ అర్ధ సెంచరీలతో ఆకట్టుకున్నారు. రియాన్ పరాగ్ 101 బంతుల్లో 5 ఫోర్లు, ఒక సిక్సర్ సహాయంతో 73, శాశ్వత్ రావత్ 67 బంతుల్లో 4 ఫోర్లు, ఒక సిక్సర్ సహాయంతో 53 పరుగులు చేశారు. కెప్టెన్ మయాంక్ అగర్వాల్ 34, కుమార్ కుషగ్ర 40 పరుగులు చేశారు. ఇండియా ఏ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 6 వికెట్లు కోల్పోయి 270 పరుగులు చేసింది. ఇండియా సీ జట్టు బౌలర్లలో అన్షుల్ కాంబోజ్, గౌరవ్‌కుమార్, మనవ్ సుతార్ చెరో రెండు వికెట్లు తీసుకున్నారు. అంతకుముందు ఇండియా సీ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో ఓర్‌నైట్ స్కోర్ 216/7తో ప్రారంభించి 71 ఓవర్లలో 234 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అభిషేక్ పోరెల్ 82 పరుగులు చేశాడు. ఇండియా ఏ బౌలర్లు అవేష్‌ఖాన్, అకీబ్ ఖాన్ చెరో మూడు వికెట్లు తీసుకున్నారు. ప్రస్తుతం ఇండియా ఏ జట్టు 333 పరుగుల ఆధిక్యంలో ఉంది.

నిత్యావసరాల పంపిణీలో గోల్‌మాల్..!

900 మంది లబ్ధిదారులకు అన్యాయం

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

రేషన్ డీలర్ల మార్పులు..చేర్పుల నేపథ్యంలో కార్డుదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వాలు మారినప్పుడు డీలర్లను కూడా మార్చడం ఆనవాయితీగా వస్తోంది. ఏ ప్రభుత్వం వస్తే వారికి అనుకూలంగా వ్యక్తులను డీలర్లుగా నియమించుకుంటారు. అయితే డీలర్లు మారినప్పుడు స్టాకు తక్కువగా వస్తోందన్న నెపంతో లబ్ధిదారులకు రేషన్ పంపిణీ చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. గుంతకల్లు మండలంలో 15,005, అర్బన్‌లో 32,976 రేషన్‌కార్డులు ఉన్నాయి. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పాత డీలర్లను తొలగించి నూతన స్టోర్ డీలర్లను నియమించారు. కొత్త డీలర్లు ఆయా గ్రామాల్లో దాదాపు 900 మంది కార్డుదారులకు రేషన్ సరుకులు పంపిణీ చేయలేదని సమాచారం. ఇదేమని అడుగుతున్న లబ్ధిదారులకు తమకు రేషన్ తక్కువగా వచ్చిందని, అందుకోసం పంపిణీ చేయలేకపోతున్నామని చెబుతున్నట్లు తెలుస్తోంది. కొన్ని గ్రామాల్లో రేషన్ సరుకులు ఇవ్వకుండా కేవలం వేలిముద్ర మాత్రమే వేయించుకున్నట్లు సమాచారం. తమకు ఇవ్వాల్సిన రేషన్ కంటే తక్కువ పరిమాణంలో ఇచ్చారని మిగిలిన వారికి ఎలా సరుకులు పంపిణీ చేయాలంటూ కొత్తగా వచ్చిన స్టోర్ డీలర్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. సంబంధిత రెవెన్యూ అధికారులు పాత డీలర్ల వద్దకు వెళ్లి విచారించగా గతంలో తాము రేషన్ పంపిణీ చేసినప్పుడు కూడా తక్కువగానే ఇచ్చారని, చేసేది లేక మేము కూడా తక్కువే ఇచ్చామంటూ అధికారులను బుకాయించినట్లు సమాచారం. ఈనేపథ్యంలో సరుకులు ఇవ్వని డీలర్లపై రెవెన్యూ అధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకోకుండా బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేసి లబ్ధిదారులకు ఇవ్వాలని కొత్త డీలర్లకు ఉచిత సలహాలు ఇస్తున్నట్లు తెలుస్తోంది. అర్బన్‌లో కూడా రేషన్‌కార్డుదారులు ఇంతకంటే దారుణమైన పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. ఏదిఏమైనా డీలర్ల మార్పులు, చేర్పులు కారణంగా లబ్ధిదారులు నష్టపోతున్నారని చెప్పవచ్చు. కావున ఉన్నతాధికారులు స్పందించి పాత డీలర్లపై చర్యలు తీసుకుని లబ్ధిదారులకు న్యాయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

తహశీల్దార్ వివరణ :ఈ విషయంపై తహశీల్దార్ ఎస్.రమాదేవిని వివరణ కోరగా లబ్ధిదారుల నుంచి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు. అయినా సరే గ్రామాల్లో విచారించి లబ్ధిదారులకు న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే సురేంద్రబాబు

ప్రజాశక్తి కళ్యాణదుర్గం

మున్సిపాలిటీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే సురేంద్రబాబు పేర్కొన్నారు. స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా మంజూరైన లెగసీ వేస్ట్ క్లియరెన్స్ మిషన్‌ను ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. డంపింగ్ యార్డ్ లో ఉన్న తడి చెత్త, పొడి చెత్త వేరు చేసే విధానంతోపాటు ఎరువును క్రస్సింగ్ చేసే మిషన్‌ను ప్రారంభించారు. మిషన్ ద్వారా పొడి చెత్తచ తడి చెత్త వేరుచేసి తద్వారా ఆ ఎరువుల విక్రయిస్తూ మున్సిపాలిటీ ఆదాయం పెంపొందించేందుకు అవకాశం ఉందని ఎమ్మెల్యే చెప్పారు. మున్సిపాలిటీ నెలకొన్న సమస్యలను పరిష్కరించి అన్ని విధాల అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్‌చ మాజీ మున్సిపల్ చైర్మన్ వైపి. రమేష్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.



మిషన్ ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు

వరద బాధితులకు విరాళాలు

ప్రజాశక్తి - రాయదుర్గం రూరల్

మండల పరిధిలోని రాయంపల్లి వద్ద ఉన్న గవి సిద్దేశ్వర స్టీల్ ప్లాంట్ నిర్వాహకులు విజయవాడ వరద బాధితులకు తమవంతు విరాళం అందజేశారు. ఈ మేరకు ప్లాంట్ జనరల్ మేనేజర్ శనివారం రూ. 1,00116ల విలువైన డిడిని శనివారం సాయంత్రం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులకు ఆయన నివాసంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాక్టరీ సిబ్బంది మోహన్ రెడ్డి, రాయదుర్గం టిడిపి మండల కన్వీనర్ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం: విజయవాడ వరద బాధితుల సహాయార్థం పలువురు విరాళాలు ప్రకటించారు. డి హిరేహాల్ మండలం కళ్యం గ్రామంలోని బాల మేధావి పాఠశాల యాజమాన్యం 50 వేల రూపాయలు విరాళం అందజేశారు. బాల మేధావి పాఠశాల కరస్పాండెంట్ వన్నూరు స్వామి శనివారం రాయదుర్గంలో స్థానిక శాసనసభ్యులు కాలవ శ్రీనివాసులును ఆయన నివాసంలో కలిసి చెక్కును అందజేశారు.

అనంతపురం రూరల్ : ఎమ్మెల్యే దగ్గుపాటి పిలుపుతో సేకరించిన విరాళాల చెక్కులను ఎమ్మెల్యే దగ్గుపాటికి శనివారం అందజేశారు. వైఎస్ఆర్ కన్స్‌స్ట్రక్షన్ ఎండి శివారెడ్డి, 32వ డివిజన్ టిడిపినేత పతకమూరి రాంప్రసాద్ కలిసి రూ.లక్ష, ఆయిల్ మిల్లర్స్, సీడ్ సప్లయర్స్ అసోసియేషన్ వారు రూ.లక్ష చెక్కులను అందజేశారు.

మానవ జీవితంలో క్రీడలు ప్రధానం

ప్రజాశక్తి-అనంతపురం

మానవ జీవితంలో క్రీడలు చాలా ముఖ్యమని ఎజిఎం సుబ్బారెడ్డి సూచించారు. శనివారం నగరంలోని కోర్టు రోడ్డులో ఉన్న శ్రీచైతన్య పాఠశాలలో ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ మీట్‌ను ఎజిఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ జీవితానికి క్రీడలు ఒక ప్రత్యేకమైన పాత్రను తీసుకొస్తాయన్నారు. ఒత్తిడితో కూడుకున్న మానవ జీవితంలో క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయన్నారు. కావున నేటి విద్యార్థులు విద్యతోపాటు ఆటలకు ప్రాముఖ్యత ఇవ్వాలన్నారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తబస్సుం, ఎఒ గోపాల్, డీన్‌లు అప్పలనాయుడు, సిరాజుద్దీన్, అకాడమిక్ కోఆర్డినేటర్ ఇర్షాద్, ప్రైమరీ, ప్రీ ప్రైమరీ ఇన్‌ఛార్జిలు భారతి, మంజుల, పిఇటిలు భరత్, గాయత్రి, అన్వేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల కబ్జాలను ఉపేక్షించం

ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి - రాయదుర్గం

రాయదుర్గం పట్టణంలో ప్రభుత్వ స్థలాలకబ్జాదారుల ఆటలు సాగనివ్వమని, ప్రభుత్వ స్థలాలను పరిరక్షిస్తామని ఎమ్మెల్యే కాలవశ్రీనివాసులు స్పష్టం చేశారు. శనివారం రాయదుర్గం పట్టణంలోని 7 వ వార్డులో ఆయన పర్యటించారు. పొట్టి శ్రీరాములు మున్సిపల్ ప్రాథమిక పాఠశాల వెనుకవైపు రోడ్డు స్థలం కొందరు ఆక్రమణ చేస్తున్నారని స్థానికులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. రోడ్డు ఆక్రమణ చేస్తూ ప్లాట్ వేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మున్సిపల్ కమిషనర్ దివాకర్ రెడ్డిని ఈ సందర్భంగా ఆదేశించారు. నకిలీ పట్టాలు, రిజిస్ట్రేషన్లు చేసుకుని ఈ స్థలాలు తమవి అంటూ కొందరు వస్తున్నారని ప్రజలనుండి తమకు ఫిర్యాదులు అందుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ స్థలాల జోలికి వచ్చినా, మున్సిపాలిటి స్థలాలను ఆక్రమించాలని చూసినా ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఏ పార్టీ వారైనా అధికారులు ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దివాకర్ రెడ్డి, మున్సిపల్ మాజీ వార్డు సభ్యుడు పోరాలు పురుషోత్తం, జింక వసుంధర, పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యం.. పాలకుల నిర్లక్ష్యం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ప్రకృతి వైపరీత్యం ఒకవైపు, పాలకుల నిర్లక్ష్యం వెరిసి అనంతపురం జిల్లావాసులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఈ ఏడాది ఒక నెల మంచి వర్షాలు మరో నెల వర్షాభావం నెలకొంటోంది. జూన్‌లో నెలలో అధిక వర్షాలు, జులై నెలలో వర్షాభావం. ఆగస్టులో మళ్లీ అధిక వర్షపాతం. సెప్టెంబరులో తిరిగి వర్షాభావం. ఇలా అన్ని విధాలుగా ప్రకృతి వైపరీత్యం నెలకొంది. వీటి నడుమ పంటల సాగు చేయడం రైతులకు ఇబ్బందికరంగా మారింది. కీలకమైన జులై నెలలో వర్షాభావంతో పంటల సాగు జరగలేదు. యాభై శాతం కూడా విత్తనం పడలేదు. ఆగస్టులో వర్షాలు పడినప్పటికీ వేరుశనగ పంట సాగుకు సమయం పూర్తయింది. దీంతో ఈ ఏడాది రైతులకు వర్షాలొచ్చినా సాగుకు అనుకూలమైన సమయంలో రాకపోవడంతో కరువులాంటి పరిస్థితులే నెలకొన్నాయి. ఇక పాలకుల నిర్లక్ష్యంతో సాగునీటికి ఇక్కట్లు తప్పడం లేదు. దేశంలోనే అత్యల్ప వర్షపాతం కలిగిన అనంతపురం జిల్లాకు సాగునీటి వసతి కూడా చాలా తక్కువగా ఉండటం గమనార్హం. ఈ ఏడాది ప్రధాన డ్యాములన్నింటిలోనూ నీరుంది. నీరు అధికమై నదిలో వృధాగా పోతున్నా జిల్లాకు అధికంగా తీసుకునేందుకు వీల్లేకుండా ఉంది. తుంగభద్ర డ్యామ్ ఇప్పటికి రెండు సార్లు నిండింది. సుమారు 300 టిఎంసిలకుపైగా నీళ్లు డ్యామ్‌కు వచ్చాయి. అయితే ఈ డ్యామ్ నుంచి అనంతపురం జిల్లాకు తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ద్వారా నీళ్లొస్తాయి. ఈఏడాది అదనంగా నీళ్లు మాత్రం తీసుకునే పరిస్థితి లేదు. ఎందుకంటే తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ సామర్థ్యం రెండు వేల క్యూసెక్కులకుపైగా ఉన్నా గరిష్టంగా 1800 క్యూసెక్కులకు మించి తీసుకోలేకపోతున్నారు. ఎందుకంటే తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ శిథిలావస్థకు చేరింది. ఎక్కువ నీళ్లు డ్రా చేస్తే గండిపడే అవకాశముంది. దీంతో నీరు పరిమితంగానే తీసుకుంటున్నారు. ప్రాజెక్టు నిర్మాణ సమయంలో దామాషా పద్ధతిలోనున్న 32 టిఎంసిల నీళ్లు కూడా తీసుకోలేకపోవడం గమనార్హం. ఈ కాలువ ఆధునీకరణ చేపట్టేందుకు 2008లో పనులు ప్రారంభించారు. క్రాప్ హాలిడే లేకుండా 2012 నాటికే పూర్తి చేయాల్సి ఉంది. రూ.480 కోట్లతో చేపట్టిన ఈ ప్రాజెక్టుకు రూ.300 కోట్ల వరకు ఖర్చు పెట్టారు. అయితే దశాబ్దకాలమైనా పనులు పూర్తవలేదు. 2019లో ఈ పనులను రద్దు చేశారు. మరో ఐదేళ్లు పనులు చేపట్టేందుకు వీల్లేదని రద్దు చేసిన జీవోలో ఉత్తర్వులిచ్చారు. అయితే ఈ విషయం అప్పటి ప్రతిపక్ష నాయకులు ఇప్పుడు తెలుసుకోవడం గమనార్హం. ఈ వారంలో జరిగిన సాగునీటి సలహా మండలి సమావేశంలో ఈ అంశాన్ని కొత్తగా తెలుసుకోవడం, దాన్ని రద్దు చేస్తామని ప్రకటించడం గమనార్హం. అయితే ఇప్పటికైనా ఈ పనులను చేపడతారా లేదా అన్న దానిపై మాత్రం స్పష్టతనివ్వలేదు. ఇక హంద్రీనీవా విషయంలోనూ అదే రకంగా నడుస్తోంది. ప్రవాహ సామర్థ్యాన్ని ఆరు వేల క్యూసెక్కులకు పెంచుతామని ప్రకటించారు. కాని టెండరు దశలోనే ఆగింది. ఈ ప్రవాహ సామర్థ్యాన్ని గడిచిన ఐదేళ్లలో పూర్తి చేసుంటే ఈసారి వరదల సమయంలో అనంతపురం జిల్లాకు పుష్కలంగా నీరు తీసుకునే అవకాశముండేది. కాని పూర్తికాకపోవడంతో రెండు వేల క్యూసెక్కుల్లోపే తీసుకోవాల్సి వస్తోంది. నేడు జలవనరుల శాఖ మంత్రి రాయలసీమలో ప్రాజెక్టుల పరిశీలనకు వస్తున్నారు. ఈ సమయంలోనైనా ఈ రెండు ప్రాజెక్టుల పనుల పురోగతిపై దృష్టి సారిస్తారా లేదా అన్నది చూడాల్సి ఉంది. ఒకవైపు వర్షాలు సకాలంలో లేక రైతులు నష్టపోతుంటే,,మరోవైపు నీరున్నా పంటలకు ఇవ్వలేని పరిస్థితులు మరోవైపు ఉన్నాయి. రానున్న ఐదేళ్లలోనైనా పాలకులు అనంతపురం జిల్లాలోని ప్రాజెక్టులపై దృష్టి సారిస్తారా లేదా అన్నది చూడాల్సి ఉంది. ఇక ఈ వారంలో చోటు చేసుకున్న ప్రధానమైన అంశాల్లో సాగునీటి సలహా మండలి సమావేశం. ఒకటి. ఈ సమావేశంలో సాగునీటిపై చర్చించి రైతులకు నీటి విడుదలపై నిర్ణయాలు చేశారు. ఇక ఈ వారంలో చోటు చేసుకున్న ప్రధానమైన వాటిల్లో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర మహాసభలు. రెండు రోజులపాటు అనంతపురం నగరంలో జరిగాయి. ఇందులో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ప్రముఖులు విచ్చేశారు. ఈ మహాసభలో రాష్ట్రంలో సైన్సు ఉద్యమం ప్రాముఖ్యతతోపాటు , రాబోయే రోజుల్లో ప్రజల్లోకి సైంటిఫికు టెంపరును ఏ విధంగా తీసుకెళ్లాలన్నది చర్చించారు. అందుకు అవసరమైన ప్రణాళికలను ఈ రెండు రోజుల్లో చర్చించి నిర్ణయించారు.

రెండున్నరేళ్లలో బిటిపికి నీరందిస్తాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బ్రహ్మసముద్రం

రెండున్నర సంవత్సరాల్లో భైరవాణితిప్ప ప్రాజెక్టుకు నీరు అందిస్తామని కళ్యాణదుర్గం శాసనసభ్యులు సురేంద్రబాబు పేర్కొన్నారు. ఈ మేరకు మండలంలోని సంతేకొండాపురం గ్రామంలో సర్పంచి వనతి మల్లిఖార్జున అధ్యక్షతన శనివారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ప్రజా పాలనతో వంద రోజులు పూర్తి చేసుకుందన్నారు. కన్నేపల్లి రాయదుర్గం రోడ్డును మూడు నెలల్లో నిర్మిస్తామన్నారు. జల జీవన్ పథకంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో నాలుగున్నర కోట్ల రూపాయల అవినీతి జరిగిందని విమర్శించారు. అనంతరం ఎస్సీ మండల కన్వీనర్ సూగేపల్లి సురేంద్ర వరద బాధితుల సహాయార్థం పదివేల రూపాయలను ఎమ్మెల్యే సురేంద్రబాబుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో తాహశీల్దార్ సుమతి, ఎంపీడీవో దాసానాయక్, సిడిపిఒ లక్ష్మీ ప్రసన్న, ఎంఇఒ ఓబులపతితో పాటు ఆయా శాఖల అధికారులు, టిడిపి మండల కన్వీనర్ శ్రీరామిరెడ్డి, మాజీ మండల కన్వీనర్లు వెంకటేష్, రాజశేఖర్‌రెడ్డి, సుబాన్ తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని జుంజురం పల్లి గ్రామంలో శనివారం సాయంత్రం మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పాటై వందరోజులు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల మన్ననలు పొందేలా పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనంతపురం రూరల్ :నగరంలోని జనశక్తినగర్ వాలసులు పలు సమస్యలపై ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు విన్నవించారు. శనివారం జనశక్తినగర్‌లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యేకు స్థానికులు కాలువలు శుభ్రం చేయాలని, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని, పింఛన్లు ఇవ్వాలని విన్నవించారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ ఆయా సమస్యలను త్వరలోనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ స్వరూప, టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళి, బిజెపి నాయకులు లలిత్‌కుమార్, గొంది అశోక్, జనసేన మహిళా నాయకురాలు పెండ్యాల శ్రీలత, కార్యకర్తలు పాల్గొన్నారు.

కరపత్రాలను విడుదల చేస్తున్న కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని, తదితరులు

కరపత్రాలను విడుదల చేస్తున్నఅనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి, తదితరులు

పోషకాహారంతో గర్భిణులకు ఆరోగ్యం

ప్రజాశక్తి-పామిడి

బాలింతలు, గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం ఆరోగ్యంగా ఉంటారని ఐసిడిఎస్ ఎసిడిపిఒ నాగమణి తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని నెహ్రూ కాలనీలో సుదర్శన్ టాకీస్ అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె బాలామతం, రాగి పిండితో చేసిన ఆహారం తీసుకోవడం వల్ల పుట్టబోయే బిడ్డ మరింత ఆరోగ్యంగా ఉంటుందన్నారు. పోషకాహారం తీసుకోవడం వల్ల రక్తహీనత సమస్య నివారించవచ్చున్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు లభించే విధంగా ఆకుకూరలు, సజ్జ,జొన్న, రాగి తినాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త అనిత, ఆయా సునీత, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

గోడౌన్ నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి-నార్పల

జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ శనివారం నాడు మండలంలోని చామలూరు, బొందల వాడ, బిపప్పూరు, గూగుడు గ్రామాల్లో నిర్మించిన బహుళ ప్రయోజన సౌకర్య గోదాములను సందర్శించారు. రైతులు పంటకు సంబంధించిన ఈకేవైసీని త్వరితగతిన పూర్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి చన్నవీరస్వామి పాల్గొన్నారు.

కొనసాగుతున్న క్రీడా పోటీలు

పుట్లూరు : మండలంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీల్లో భాగంగా శనివారం 2వ రోజు చెస్, యోగ, పోటీలను నిర్వహించినట్లు మండల విద్యాధికారులు శ్రీదేవి, ప్రేమ్ కుమార్ తెలిపారు. జెడ్పీ, ఆదర్శ పాఠశాలలో పోటీలను నిర్వహించారు. మండల స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులను నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం విజయలక్ష్మి, పీడీలు మురళి, పక్కీరప్ప, జ్యోతి, పవన్ కుమార్, మల్లేశ్వరమ్మ పాల్గొన్నారు.

మహారాజశ్రీ డోన్ సీనియర్ సివిల్ జడ్జిగారి కోర్టు
ఐ.పి. నెంబరు 5/24
నాగేళ్ళ వేంకటరమణయ్య, వయస్సు 46 సం॥
తండ్రి నాగేళ్ళ క్రిష్ణమూర్తి, R/o. ఇంటి నెం. 8/124, ముల్లవీధి, మసీదు దగ్గర, వెల్దుర్తి గ్రామం & మండలం, కర్నూలు జిల్లా. ...అర్జీదారు/Debtor
-V/s-
R3. చింతల రాముడు, వయస్సు 60 సం॥లు తండ్రి పేరు తెలియదు, ధర్మవరం రోడ్డు, నార్పల గ్రామం మరియు మండలం, అనంతపురం జిల్లా.
R4. S. రామాంజనేయులు@అంజి,వయస్సు 50సం॥లు C/o. తండ్రి పేరు తెలియదు, మల్లారెడ్డి దెగడి గేటరు, నాయినిపల్లి క్రాసురోడ్డు, నార్పల గ్రామం మరియు మండలం, అనంతపురం జిల్లా.
R5. ఫకృద్దీన్, వయస్సు 60 సం॥లు తండ్రి పేరు తెలియదు C/o. సునీల్ దెగడి గేటరు, పాత మిల్ టౌన్ రోడ్డు నార్పల గ్రామం & మండలం, అనంతపురం జిల్లా.
R6. నారాయణస్వామి, వయస్సు, 65 సం॥లు తండ్రి పేరు తెలియదు C/o. మల్లారెడ్డి దేగడి గేటరు నాయనిపల్లి క్రాస్ రోడ్డు, నార్పల గ్రామం, మరియు మండలం అనంతపురం జిల్లా.
R7. మల్లారెడ్డి, వయస్సు 60 సం॥లు తండ్రి పేరు తెలియదు, C/o. మల్లారెడ్డి దేగడి గేటరు నాయనిపల్లి క్రాస్ రోడ్డు, నార్పల గ్రామం, మరియు మండలం అనంతపురం జిల్లా.
R8. సురేసు, వయస్సు 60 సం॥లు తండ్రి పేరు తెలియదు, C/o. మల్లారెడ్డి దేగడి గేటరు నాయనిపల్లి క్రాస్ రోడ్డు, నార్పల గ్రామం, మరియు మండలం అనంతపురం జిల్లా.
R11. నాగేసు, వయస్సు 55 సం॥లు తండ్రి పేరు తెలియదు, C/o. నాగేసుమల్లు దేగడి గేటరు, ధర్మవరం రోడ్డు, నార్పల గ్రామం& మండలం, అనంతపురం జిల్లా.
R12. ఆదియప్ప, వయస్సు 50 సం॥లు తండ్రి పేరు తెలియదు, ధర్మవరం రోడ్డు C/o. నాగేశు, దేగడి గేటరు, నార్పల గ్రామం & మండలం, అనంతపురం జిల్లా.
R13. V.K. రెడ్డి, వయస్సు 70 సం॥లు తండ్రి పేరు తెలియదు, C/o. నాగేసు దేగడి గేటరు, నార్పల గ్రామం & మండలం, అనంతపురం జిల్లా.
R14. రాఘవ, వయస్సు 45 సం॥లు తండ్రి పేరు తెలియదు, C/o. నాగేశు దేగడి గేటరు, ధర్మవరం రోడ్డు, నార్పల గ్రామం & మండలం, అనంతపురం జిల్లా.
R15. కుంటి మద్ది శీను, వయస్సు 46 సం॥లు తండ్రి పేరు తెలియదు, C/o. నాగేశు దేగడి గేటరు, ధర్మవరం రోడ్డు, నార్పల గ్రామం& మండలం, అనంతపురం జిల్లా.
R16. మల్లికార్జున, వయస్సు 40 సం॥లు తండ్రి పేరు తెలియదు, C/o. మల్లారెడ్డి దేగడి గేటరు, నాయినిపల్లి క్రాసు రోడ్డు, నార్పల గ్రామం & మండలం, అనంతపురం జిల్లా.
R17. రమేష్, వయస్సు 40 సం॥లు తండ్రి పేరు తెలియదు, C/o. మల్లారెడ్డి దేగడి గేటరు, నాయినిపల్లి క్రాసు రోడ్డు, నార్పల గ్రామం & మండలం, అనంతపురం జిల్లా.
R18. నాగరాజు, వయస్సు 60 సం॥లు తండ్రి పేరు తెలియదు, C/o. మల్లారెడ్డి దేగడి గేటరు, నాయినిపల్లి క్రాసు రోడ్డు, నార్పల గ్రామం & మండలం, అనంతపురం జిల్లా. ... రెస్పాండెంట్స్/Creditors
అనంతపురం జిల్లా, నార్పల గ్రామం మరియు మండలం ప్రజలకు తెలియజేయడం ఏమనగా పై నెంబరు ఐ.పి. 5/24, అర్జీదారు నాగేళ్ళ వేంకటరమణయ్య, ఇ.నెం. 8/124, ముల్లా వీధి, మసీదు దగ్గర వెల్దుర్తి గ్రామం & మండలం గ్రామ నివాసి అయిన వెల్దుర్తి గ్రామం మరియు మండలం, కర్నూలు జిల్లా నందు మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వేరు శనగ విత్తనంల వ్యాపారంలో వచ్చిన నష్టముల వలన తనను దివాలా దారునిగా తీర్మానం చేయమని కోరుతూ పై కోర్టులో అర్జీదాఖలు (ఐ.పి. పిటిషను) చేసినాడు. ఇందు పైన ఎవరికైనా ఆక్షేపణలు ఉన్నయెడల 26-09-2024 తేదీన ఉదయం 10.30 గంటలకు పై కోర్టులో హాజరై తెలుపుకొనవలెను. లేని యెడల పరోక్షమున విచారించి తీర్మానింపబడును.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది : 26-09-2024
వెల్లుట్ల రామలింగయ్య
అర్జీదారుపరం అడ్వకేటు,
డోన్, నంద్యాల జిల్లా.
సెల్ నెంబరు : 9346438116

IN THE COURT OF ADDITIONAL SUBORDINATE JUDGE AT PONNERI
M.C.O.P NO: 585 OF 2019
Sivasankar Reddy ...Petitioner
-VS-
1. Chintakayala Naresh
2. The New India Assurance Company Ltd., ...Respondents
To:-
R.1 Chinatakayala Naresh, S/o. Chintakayala Nageswar, Chitrachedu, Pedda Vaduguru, Anantapur, Pin-515611 ... For 1 Respondent
PAPER PUBLICATION
Please take notice that the above M.C.O.P No. 585/2019 has been posted for your appearance on: 03.10.2024 before the Additional Subordinate Judge at Ponneri. Hence you are requested to appear before the Hon'ble court on: 03.10.2024 at about 10.30 A.M. failing which you will be set exparte and the case will be decided on merits.
Hg: 03.10.2024
K.HARIBABU, B.Sc., B.L.,
G.LOGU, M.A., B.L.,
Counsel for Petitioner

ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ, గుమ్మనూరు జయరాం

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన

'ఇది మంచి ప్రభుత్వం'లో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి-ఉరవకొండ

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో రాష్ట్రంలో ప్రజారంజక పాలన సాగుతోందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలియజేశారు. విడపనకల్లు మండల పరిధిలోని గడేకల్ గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే కూటమి ప్రభుత్వం ప్రజలకు ఐదు హామీలు నెరవేర్చిందన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్ర అభివద్ధితో పాటు ప్రజల సంక్షేమానికి కషి చేస్తామన్నారు. అనంతరం మంత్రి పయ్యావుల కేశవ్‌ను టిడిపి నాయకులు, కార్యకర్తలు గజమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ బీడీ చినమారయ్య, నాయకులు భీమ లింగప్ప, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు మేలు చేసేలా పాలన : గుమ్మనూరు జయరాం

పామిడి : కూటమి వంద రోజుల పాలనలో ప్రజలకు మేలు చేసేలా అన్ని కార్యక్రమాలూ చేపడుతున్నట్లు గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తెలియజేశారు. శనివారం పట్టణంలోని 20వ వార్డు తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఎదురుగా "ఇది మంచి ప్రభుత్వం" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన మొదటి వంద రోజుల్లోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో ప్రజా ఉపయోగ కార్యక్రమాలను అమలు చేసినట్లు చెప్పారు. మెగా డీఎస్సీ, పింఛన్ల పెంపు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దును అమలు చేసినట్లు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారంగా ప్రతినెలా 1వ తేదీన ఇంటి వద్దనే పింఛన్లను అందిస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో చెప్పిన ప్రతి హామీనీ నెరవేరుస్తామని తెలియజేశారు. గత వైసిపి ప్రభుత్వం కేవలం ఆర్భాటాలు తప్పా రాష్ట్రానికి, ప్రజలకు చేసింది శూన్యం అన్నారు. ఈ కార్యక్రమంలో పామిడి ఇన్‌ఛార్జి గుమ్మనూరు ఈశ్వర్, తహశీల్దార్ శ్రీధర్ మూర్తి, ఎంపీడీవో ప్రభాకర్, ఈఒఆర్‌డి శశికళ, పంచాయతీ సెక్రెటరీ చంద్రశేఖర్, సచివాలయ సిబ్బంది, టిడిని నాయకులు ప్రభాకర్ చౌదరి, ఆర్ఆర్.రమేష్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ గౌస్ పీర, బొమ్మా మోహన్, ముసలిరెడ్డి, రాజశేఖర్ గౌడ్, అంజి నాయక్, లక్ష్మీదేవి, జనసేన ధను, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు పేదలకు చేరాలి : బండారు శ్రావణిశ్రీ

బుక్కరాయసముద్రం : ప్రభుత్వ పథకాలు పేదలకు చేర్చకుండా నిర్లక్ష్యంగా వ్యవహించే అధికారులపై చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ హెచ్చరించారు. శనివారం మండల పరిధిలోని సంజీవ గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మొదటి వంద రోజుల్లో ఇచ్చిన హామీలల్లో ముఖ్యమైన 5 హామీలను నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకు దక్కిందన్నారు. ఇచ్చిన మాట ప్రకారంగా ప్రతినెలా 1వ తారీఖున ఇళ్ల వద్దేనే పింఛన్లు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్, గృహ నిర్మాణ శాఖ అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దాసరి సునీత, పసుపుల హనుమంత రెడ్డి, గోవిందరెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర ప్రగతి

గుత్తి : సిఎం నారా చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రం అభివద్ధి చెందుతుందని టిడిపి నాయకులు పేర్కొన్నారు. టిడిపి మండల కన్వీనర్ బర్దివలి, టిడిపి పట్టణ అధ్యక్షులు ఎంకె.చౌదరి ఆధ్వర్యంలో బేతపల్లి గ్రామంలో శనివారం నాడు 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం దసలవారీగా పథకాలను ప్రవేశపెట్టబోతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్ మియా, ఎంపీటీసీ ఎం.ధనుంజయ, మాజీ సర్పంచి కె.నాగేంద్ర, నాయకులు దిల్కాశీనా, గోవర్ధన్ గౌడ్, జక్కలచెరువు ప్రతాప్, చికెన్ శీనా, ఎస్ఎం.బాషా బి.వేణుగోపాల్, రామకృష్ణ, టి.సుధాకర్, సాంబశివ, నాగరాజు, అగ్గిరాముడు, జనసేన నాయకుడు పాటిల్ సురేష్ పాల్గొన్నారు.

హామీలను అమలు చేస్తున్న చంద్రబాబు

నార్పల : ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని మాజీ ఎంపీపీ ఆకుల అరుణ, టిడిపి నాయకులు ఆకుల విజయకుమార్ బాబు తెలిపారు. మండల కేంద్రంలోని స్థానిక ఆకుల కాలనీలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని టిడిపి నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొదటి 100 రోజుల్లో ఇచ్చిన హామీల్లో ముఖ్యమైన 5 హామీలను నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుదే అన్నారు. పంచాయతీలకు రూ.1452 కోట్ల నిధులు ఇచ్చి ప్రాణం పోశారన్నారు. పేదవాడి ఆకలి తీర్చడం కోసం అన్న కాంటీన్లను ఏర్పాటు చేశారన్నారు. పులివెందుల ఎమ్మెల్యే జగన్ రెడ్డి మీడియా ముందుకువచ్చి ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. గత వైసిపి ప్రభుత్వం కేవలం ఆర్భాటాలు చేయడం తప్ప రాష్ట్రానికి, ప్రజలకు చేసింది ఏమీ లేదని తెలిపారు. రానున్న రోజుల్లో శింగనమల నియోజకవర్గం ఎమ్మెల్యే బండారు శ్రావణ శ్రీ ఆధ్వర్యంలో మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆకుల పవన్ కిషోర్, ఆకుల అనిల్ సచివాలయ సిబ్బంది మైసూరా రెడ్డి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

జగన్ రెడ్డికి శిక్ష తప్పదు

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

తిరుమల లడ్డును కల్తీ చేసి అపవిత్రం చేసిన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి శిక్ష తప్పదని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ తెలిపారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన 41వ డివిజన్ జనశక్తి నగర్‌లో శనివారం పర్యటించారు. వంద రోజుల్లో చేసిన అభివద్ధి సంక్షేమ కార్యక్రమాల గురించి ఎమ్మెల్యే దగ్గుపాటి ఇంటింటికి వెళ్తూ వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద రోజుల్లోనే మెగా డీఎస్సీ తో పాటు అన్న క్యాంటీన్లు, పింఛన్ల పెంపు, ధాన్యం కొనుగోలుకు సంబంధించిన నిధులు విడుదల వంటివి ఎన్నో చేశామన్నారు. మాజీ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి పిచ్చి ప్రేలాపనలు చేస్తున్నారని తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి ప్రభుత్వంలో నాసిరకం మద్యంతో వేలాదిమందిని అనారోగ్యానికి గురి చేసింది వాస్తవం కాదాని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ తహసిల్దారు హరి, సచివాలయం సెక్రటరీ సంగం శ్రీనివాసులు, మాజీ మేయర్ స్వరూప, టిడిపి రాష్ట్ర కార్యదర్శులు ఆదినారాయణ, గాజుల ఆదెన్న, రాయల్ మురళి పాల్గొన్నారు.

విజయవాడ వరద బాధితులకు అండగా అనంత వ్యాపారులు

అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పిలుపుతో విజయవాడ వరద బాధితులకు అనంతపురానికి చెందిన వ్యాపార, వాణిజ్య విభాగం వారు అండగా నిలిచారు. వైఎస్సార్ కన్‌స్ట్రక్షన్స్ ఎమ్‌డీ శివారెడ్డి లక్ష రూపాయల విరాళం ప్రకటించారు. ఆయిల్ మిల్లర్స్ అండ్ సీడ్ సప్లయర్స్ అసోసియేషన్ లక్ష రూపాయలు ప్రకటించారు. వీరంతా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ను కలసి చెక్ అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకుడు గంగరామ్, 32వ డివిజన్ టిడిపి నాయకుడు పతకమూరి రాంప్రసాద్ పాల్గొన్నారు.

ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

సామూహిక సీమంతాల్లో ఎమ్మెల్యే సతీమణి శ్రీలక్ష్మి

నగరంలోని 12వ డివిజన్ అంగన్వాడీ కేంద్రంలో శనివారం నిర్వహించిన పోషణ మాసోత్సవాల కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సతీమణి శ్రీలక్ష్మి పాల్గొన్నారు. 12వ డివిజన్ కార్పొరేటర్ జనబలం బాబా, సిడిపిఒ లలితమ్మ, సూపర్‌వైజర్ విష్ణువర్ధని, టీడీపీ నాయకులు కవిత, భూమ శ్రీలత, లక్ష్మి నాయుడుమ్మ తదితరులు పాల్గొన్నారు. అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీ మహిళలకు సామూహిక శ్రీమంతాలు నిర్వహించారు. దగ్గుపాటి శ్రీలక్ష్మీ స్వయంగా మహిళలకు పసుపు, కుంకుమ అందించారు.

మహిళ ఆత్మహత్య

పుట్లూరు : అనారోగ్య సమస్యలతో మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన మేరకు.. మండలంలోని బాలాపురం గ్రామానికి చెందిన తలారి పెద్దయ్య తన పెద్ద కూతురు రేణుక(28)ని నాలుగేళ్ల క్రితం కొలిమిగుండ్ల మండలం తుమ్మలపెంట గ్రామానికి చెందిన గురుదేవ్‌కు ఇచ్చి వివాహం చేశారు. వివాహ అనంతరం కుటుంబ కలహాలతో రేణుక భర్తకు దూరంగా ఉంటూ తండ్రి దగ్గరే ఉండేది. గతవారం రేణుక తన అవ్వ ఇంటికి వెళ్ళింది. తనకు ఆరోగ్యం బాగాలేదని చెప్పింది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు.

సీతారాం ఏచూరికి నివాళి

ప్రజాశక్తి - బొమ్మనహాల్

మండలంలోని ఉద్దేహాల గ్రామంలో సిఐటియు ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి సంతాప సభను నిర్వహించారు. సిఐటియు జిల్లా నాయకురాలు నాగమణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఏచూరి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు, ఆశా, ఆంగన్వాడీ వర్కర్లు, వెలుగు సిబ్బంది, హమాలీలు తదితరులు పాల్గొన్నారు.

విరాళాలు అందించడం అభినందనీయం : కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్ : విజయవాడ వరద బాధితుల కోసం విరాళాలు అందించడం అభినందనీయమని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలియజేశారు. శనివారం కలెక్టర్ ఛాంబర్లో నగరంలోని టివి టవర్ ఎదురుగా ఉన్న గ్లోబల్ విద్యాసంస్థలకు చెందిన అధ్యాపక, అధ్యాపకేతర, మేనేజ్మెంట్ ఆధ్వర్యంలో విజయవాడ వరద భాదితులకు రూ.2,00,116 రూపాయల చెక్కును కలెక్టర్‌కు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరద బాధితుల కోసం విరాళాలు అందించడం ఎంతో గొప్ప విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో గ్లోబల్ యాజమాన్యంతో పాటు అకడమిక్ డీన్ ఆంజనేయులు, కళాశాల ప్రిన్సిపాల్ నిర్మల, స్కూల్ ప్రిన్సిపాల్ ఆదిలక్ష్మి, అధ్యాపక బందం పాల్గొన్నారు.

అటవీ ప్రాంతం పరిశీలన

ప్రజాశక్తి-యల్లనూరు

ఇటీవల మండల పరిధిలోని అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు శ్రీగంధం చెట్లను నరికివేసిన సంఘటన తెలిసిందే. అందులో భాగంగా అటవీ పారెస్ట్ గార్డ్ సుధాకర్ స్థానిక ఎస్ఐ రామప్రసాద్‌కు ఈ విషయంపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ తన సిబ్బందితో అటవీ ప్రాంతాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ సంపత్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రాప్తాడుకు వస్తే అభివృద్ధి చూపిస్తాం

మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డికి ఎమ్మెల్యే పరిటాల సునీత సవాల్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వంద రోజుల్లో రాప్తాడు నియోజకవర్గానికి ఏం చేశారంటూ మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారని, ఆయన రాప్తాడుకు వస్తే తాము చేసిన అభివృద్ధి ఏమిటో చూపిస్తామని ఎమ్మెల్యే పరిటాల సునీత సవాల్ విసిరారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆమె అనంతపురం రూరల్ మండల పరిధిలో పర్యటించారు. కురుగుంట, పాపంపేట, కక్కలపల్లి కాలనీ, ఆకుతోటపల్లి తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి వంద రోజుల్లో చేసిన అభివద్ధి, సంక్షేమ కార్యక్రమాల్ని వివరించారు. సిసి రోడ్ల నిర్మాణానికి అనంతపురం రూరల్ మండలానికి 5.50కోట్లు మంజూరు కాగా.. కురుగుంట కాలనీ, పాపంపేట, కక్కలపల్లి, ఆకుతోటపల్లి పంచాయతీలలో 3కోట్ల 25లక్షలతో సిసి రోడ్ల నిర్మాణానికి భూమి పూజలు చేశారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ వంద రోజుల్లో కేవలం సిసి రోడ్లకోసం నియోజకవర్గానికి 25కోట్లు తీసుకొస్తే.. దానిపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. అసలు ప్రకాష్ రెడ్డి ఏ రోజైనా అభివద్ధి గురించి ఆలోచించారని ప్రశ్నించారు. అధికారంలో ఉండగా సైకో జగన్ రెడ్డి అనేక పాపాలు చేశారని... అందులో తిరుమల లడ్డుని కలుషితం చేయడం క్షమించరాని నేరం అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మేయర్.. వాస్తవాలు తెలుసుకో..!

అనంతపురం కలెక్టరేట్ : మాజీ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డికి అనంతపురం మేయర్ వసీం రబ్బర్ స్టాంపు అని ఆయన వాస్తవాలు తెలుసుకుని మాట్లాడితే బాగుంటుందని అనంతపురం జిల్లా తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీ నరసింహ, టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షుడు పోతుల లక్ష్మీనరసింహులు, టిడిపి క్రిస్టియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామిదాసు తెలిపారు. టిడిపి వంద రోజుల పాలన, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌పై మేయర్ వసీం చేసిన వ్యాఖ్యల మీద వారు తీవ్రంగా స్పందించారు. గత ఐదేళ్లపాటు మీరంతా ఏమి అభివద్ధి చేశారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే నగరపాలక సంస్థ కార్యాలయంలోని మేయర్ ఛాంబర్ వద్ద ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శిలు శివకుమార్, సాదిక్ వలి, హరి, శీన, పాల్గొన్నారు.

అనంతపురంలో నిరుద్యోగులతో కలిసి ర్యాలీ చేస్తున్న ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు

కానిస్టేబుల్ నోటిఫికేషన్ విడుదల చేయండి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్న కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పెండింగ్‌లో ఉన్న కానిస్టేబుల్ పోస్టుల నోటిఫికేషన్ విడుదల చేసేందుకు సుప్రీంకోర్టులో హోంగార్డుల రిజర్వేషన్ కేసును పరిష్కరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం నాడు నిరుద్యోగులతో కలిసి కలెక్టరేట్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ముందుగా నగరంలోని ప్రధాన వీధుల నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా పరమేష్ మాట్లాడుతూ రెండు సంవత్సరాల నుంచి కానిస్టేబుల్ నోటిఫికేషన్ ప్రక్రియ పెండింగ్‌లో ఉందన్నారు. సుప్రీంకోర్టులో హోంగార్డు రిజర్వేషన్‌కు సంబంధించిన కేసు తక్షణమే పరిష్కారం చేయాలన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్, జిల్లా అధ్యక్షుడు సిద్దు, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు నూరుల్లా, ఎస్ఎఫ్ఐ పట్టణ నాయకులు భీమేష్, సోము, గణేష్, సాయి, పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగులకు ఎంపికైన అభ్యర్థులు పాల్గొన్నారు.

పేదలకు మంచి చేయటమే ప్రభుత్వ లక్ష్యం : మాసుల

ప్రజాశక్తి-శింగనమల

రాష్ట్రంలో పేదలకు సంక్షేమాన్ని అందించే మంచి ప్రభుత్వ పాలన కొనసాగుతుందని రాష్ట్ర తెలుగు యువత మాజీ కార్యదర్శి మాసుల చంద్రమోహన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంచి పాలన సాగిస్తున్నారని చెప్పారు. శింగనమల నియోజకవర్గం అభివద్ధి లక్ష్యంగా ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ, ఎంపి అంబిక లక్ష్మీనారాయణ అన్ని చర్యలూ తీసుకుంటున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే పింఛన్ల పెంపు, ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు తదితర ప్రజ ఉపయోగ కార్యక్రమాలను చేపట్టిందని తెలియజేశారు. విజయవాడలో వరద బాధితులను కంటికి రెప్పలా చంద్రబాబు నాయుడు కాపాడారన్నారు. అన్న క్యాంటీన్ల ద్వారా పేదల ఆకలి తీరుస్తున్నట్లు చెప్పారు.

సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ చేపట్టాలి

మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి లడ్డుపై టిడిపి నాయకులు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవాలను తేల్చేందుకు సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. లడ్డూలో నిజంగా కల్తీ చేసిన ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. వైసిపి అధికారంలో ఉన్న సమయంలో లడ్డు ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి సరిపరా చేస్తున్న వాటిని తనిఖీ చేసి, 18 ట్యాంకర్లను వెనక్కు పంపిన విషయాన్ని టిడిపి నాయకులు గుర్తించాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కావాలనే జగన్మోహన్‌రెడ్డిపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. దేవాలయాలను వేదికలు చేసుకుని రాజకీయాలు చేయడం నీచమైన చర్య అన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు నాయుడు ఇలాంటి వాటిని మానుకుని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో శ్రద్ధ పెట్టాలని హితువు పలికారు.



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపల్ చెన్నారెడ్డి

సైబర్ నేరగాళ్లతో ప్రమాదం

జెఎన్‌టియు ప్రిన్సిపల్ పి.చెన్నారెడ్డి

ప్రజాశక్తి -అనంతపురం

సైబర్ నేరగాళ్ల వల్ల సమాజం, ప్రజలకు తీవ్ర ప్రమాదం ఏర్పడుతుందని, విద్యార్థులు వీటిపై అప్రమత్తంగా ఉండాలని జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.చెన్నారెడ్డి తెలియజేశారు. శనివారం నాడు అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో ఎన్ఎస్ఎస్ యూనిట్-3 ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని సైబర్ సెక్యూరిటీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా॥ జి.మమత అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి మాట్లాడుతూ ఈమెయిల్స్‌లో అనుమానాస్పద లింక్స్‌పై క్లిక్ చేయరాదన్నారు. ఎటిఎంల వద్ద అనుమానాస్పద వ్యక్తుల వద్ద జాగ్రత్తగా ఉండాలన్నారు. వ్యక్తిగత పాస్‌వర్డ్‌లను ఎవరికీ చెప్పరాదన్నారు. రీసోర్స్ పర్సన్ ఇజ్, సి -డాక్ ప్రాజెక్టు మేనేజర్ ఎం.జగదీష్ బాబు మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల పెరుగుదల కారణంగా సైబర్ బెదిరింపులు అధికం అయ్యాయన్నారు. విద్యార్థులు వీటిపై జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్ ట్రైనింగ్ డాక్టర్ సి.రామకృష్ణయ్య, మెకానికల్ విభాగం అధిపతి డాక్టర్ కళ్యాణి రాధా , పిఆర్ఒ డాక్టర్ బి. ఓంప్రకాష్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఐటిలో..

శింగనమల : సైబర్ సెక్యూరిటీ అవేర్‌నెస్ ప్రోగ్రాంను బుక్కరాయసముద్రం మండల పరిధిలోని రోటరీపురం శ్రీనివాస రామానుజెన్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించారు. సైబర్ నేరాలకు గురి కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు వివరించారు. ఈ కాంసక్రమంలో ప్రిన్సిపల్ డా॥జి.బాలకృష్ణ, రీసోర్స్ పర్సన్స్ శశికళ, సునీత , సౌమథి, కో- ఆర్డినేటర్ డా॥వెంకట నాగజయుడు పాల్గొన్నారు.

గురజాడ అప్పారావుకు నివాళి

ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణంలోని సిఐటియు కాలనీలో గురజాడ అప్పారావు జయంతిని శనివారం ఆ కాలనీ వాసులు, ప్రజా సంఘాల నాయకులు ఘనంగా జరుపుకున్నారు. గురజాడ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లౌకిక పరిరక్షణ వేదిక కన్వీనర్ చొక్కా సునీల్ కుమార్, పట్టణ పౌరుల సంక్షేమ సంఘం కన్వీనర్ మారుతి ప్రసాద్, ఐద్వా అధ్యక్షురాలు జ్యోతి మాట్లాడుతూ సమాజంలో రుగ్మతలు, అసమానతలు పోగొట్టుకోవడానికి గురజాడ వాడిన సాహిత్యం సామాన్యులకు అర్థమయ్యే రీతిలో ఉండేదన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పౌరుల సంక్షేమం సంఘం నాయకులు చంద్రశేఖర్, ఆవాజ్ పట్టణ కార్యదర్శి షేక్ అబ్దుల్లా, కెవిపిఎస్ నాయకులు సూరి, డివైఎఫ్ఐ నాయకులు రాము పాల్గొన్నారు.

గుత్తి : తెలుగు రచయిత గురజాడ అప్పారావు 162వ జయంతిని పురస్కరించుకుని ఏపీ రాష్ట్ర పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. శనివారం స్థానిక పట్టణంలోని పెన్షనర్ల భవనంలో గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర పెన్షన్ల సంఘం తాలూకా ఉపాధ్యక్షురాలు స్వర్ణాంబ, అదనపు కార్యదర్శి జెన్నే కుళ్లాయిబాబు, నాయకులు వెంకటేష్, లక్ష్మీనారాయణ రెడ్డి, విజయలక్ష్మి, కృష్ణవేణి, నారాయణరెడ్డి, హుస్సేన్ అహ్మద్, గోవిందప్ప, చెన్నారెడ్డి, నారాయణశెట్టి, వెంకటనారాయణ, శామ్యూల్, షెక్షావలి తదితరులు పాల్గొన్నారు.

గాజుల నారాయణస్వామి సేవలు మరువలేనివి

ప్రజాశక్తి -అనంతపురం

ఎల్‌కెపి మాజీ అధ్యక్షులు గాజుల నారాయణస్వామి 80వ జయంతి సందర్భంగా శనివారం నాడు అనంతపురం ఎల్‌కెపిలో నివాళి అర్పించారు. నారాయణస్వామి చిత్రపటానికి ఎల్‌కెపి అధ్యక్షుడు వెంకట సుబ్బయ్య, కార్యదర్శి పద్మజ, సభ్యులు రామగోవిందు, అడిషనల్ ఎస్పీ మునిరామయ్య తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సంధర్బంగా శకుని నాటకాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌కెపి సభ్యులు అస్లాంబాషా పాల్గొన్నారు.

గాజుల ఆది నారాయణకు నివాళులు అర్పిస్తున్న ఎల్‌కెపి ప్రతినిధులు

గుత్తి మున్సిపల్ మేనేజర్‌గా పి.రాంబాబు

ప్రజాశక్తి-గుత్తి

గుత్తి పురపాలక సంఘం నూతన మేనేజర్‌గా పి.రాంబాబు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న మేనేజర్ మురళీధర్ ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. ఆయన స్థానంలో జమ్మలమడుగు మున్సిపాలిటీలో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న రాంబాబు బదిలీపై వచ్చారు. బాధ్యతల స్వీకరణ అనంతరం మున్సిపల్ కమిషనర్ బి.జబ్బర్ మియాను మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన మేనేజర్‌ను మున్సిపాలిటీలోని వివిధ విభాగాల అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పాలిటెక్నిక్ కళాశాలలో కృతజ్ఞతా దినోత్సవం

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉరవకొండ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం నాడు ప్రపంచ కృతజ్ఞతా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌తో పాటు ఆ శాఖ విభాగాధిపతి సురేష్ బాబు మాట్లాడుతూ నిత్య జీవితంలో ప్రతిరోజూ వారు పొందిన సేవలకు కృతజ్ఞత తెలపడం కనీస కర్తవ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఎస్‌డిసి కోఆర్డినేటర్ జయలక్ష్మి, భౌతిక శాస్త్ర అధ్యాపకురాలు ధనలక్ష్మి, కోర్సు శిక్షకులు సునీల్, ఉదయ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటేష్ నాయక్, సివిల్ ఇంజినీర్ అధ్యాపకుడు రాజేష్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు సర్వీసులను పునరుద్ధరించండి

ప్రజాశక్తి - యల్లనూరు

తాడిపత్రి వయా యల్లనూరు మీదుగా సింహాద్రిపురం వరకు సాయంత్రం 5 గంటల బస్సు పునరుద్ధరణ తో పాటు ఉన్న సర్వీసులను సమయానికి అనుగుణంగా నడపాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజా రామిరెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన తన డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తాడిపత్రి డిపో మేనేజర్‌కు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతం లో యల్లనూరు నుండి తాడిపత్రి కి వెళ్లాలంటే ప్రతి అరగంట కు ఒక బస్సు ఉండేదని పాఠశాలలకు కళాశాలకు వెళ్లే విద్యార్థులకు సౌకర్యంగా ఉండేదని అన్నారు. ప్రస్తుతం వున్న బస్సులను తొలగించడం తో ప్రయాణికులతో పాటు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ఉచిత గుండె వైద్య శిబిరం

బుక్కరాయసముద్రం : ఉచిత గుండె వైద్యశిబిరం పేద ప్రజలకు ఎంతో ఉపయోగకరమని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ అన్నారు మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉచిత వైద్యశిబిరాల నిర్వహణ పేద ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు వినతి

రాయదుర్గం : రాయదుర్గం పట్టణంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృమాల వద్ద పారిశుధ్య పరిస్థితులు మెరుగుపరచాలని ఎఐఎస్ఎఫ్ నాయకులు రాయదుర్గం మున్సిపల్ కమిషనర్ దివాకర్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆసంఘం తాలూకా ఉపాధ్యక్షుడు మధు, కోశాధికారి దినకర్ తదితరులు శనివారం కమిషనర్‌ను ఆయన చాంబర్లో కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొద్ది రోజులుగా వసతిగృహాల్లోని విద్యార్థులు అస్వస్థతకు గురై ఆసుపత్రి పాలవు తున్నారన్నారు. కనేకల్ మండలం ఎర్రగుంట గ్రామానికి చెందిన ఒక విద్యార్థి డెంగీ వ్యాధికి గురై మృతిచెందాడని గుర్తు చేశారు. వసతిగృహాల వద్ద దోమల బెడద అధికంగా ఉందని, పారిశుధ్యం మెరుగుపరచాలని వారు కమిషనర్ కు విజ్ఞప్తి చేశారు.

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి - రాయదుర్గం

హీరేహాల్ మండలం మలప్పనగుడి పంచాయితీ సర్పంచి బోయ రుద్రేశ్ శనివారం తెలుగుదేశం పార్టీలో చేరారు. రాయదుర్గం శాసనసభ్యులు కాలవ శ్రీనివాసులు నివాసంలో రుద్రేశ్‌కు ఎమ్మెల్యే టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. డి. హీరేహాళ్ తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ హనుమంత రెడ్డి, చర్లపల్లి ఎంపీటీసీ మొండి మల్లికార్జున ఆధ్వర్యంలో సర్పంచి రుద్రెష్ తెలుగుదేశం పార్టీ చేరారు. ఈసందర్భంగా రుద్రేష్ మాట్లాడుతూ మలపనగుడి పంచాయతీని ఎమ్మెల్యే సహాయ సహకారాలతో అభివృద్ధి చేస్తానని చెప్పారు.

మట్టి అక్రమ తరలింపు ఆపాలి

ఓబుళదేవరచెరువు : మండలంలోని ఇనగలూరు గ్రామ పంచాయతీలోని గుట్ట, పోరంబోకు స్థలంలో దాదాపు 60 ఎకరాల్లో మట్టిని అక్రమంగా తరలించారని, దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని శనివారం సిపిఐ మండల శాఖ ఆధ్వర్యంలో సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య, కార్యవర్గ సభ్యులు ఆంజనేయులు, మండల కార్యదర్శి చలపతి, రైతు సంఘం నాయకులు శ్రీనివాసులు డిమాండ్ చేశారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు

ఎమ్మెల్యే సింధూర, ఎంపీ పార్థసారథి, మాజీ మంత్రి పల్లె

ప్రజాశక్తి-ఓబులదేవరచెరువు

కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సింధూర, ఎంపి పార్థసారథి

చదువుతోనే ప్రతి ఒక్కరికీ సమాజంలో తగిన గుర్తింపు, గౌరవం లభిస్తాయని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, ఎంపి పార్థసారథి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి తెలిపారు. స్థానిక జడ్పీ హైస్కూల్ ఆవరణలో రూ. 1.145 కోట్ల వ్యయంతో నిర్మించిన ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవనాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. పేద విద్యార్థుల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్ద పీట వేసిందన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షనతో బాగా చదువుకొని ఉన్నత విద్యనభ్యసించాలని సూచించారు. జగన్ ప్రభుత్వంలో 'నాడు-నేడు' కింద రంగులు వేయడం తప్ప విద్యాభివృద్ధికి పాటు పడలేదన్నారు. అనంతరం వరద బాధితుల సహాయార్థం విద్యార్థులతో పాటు పలువురు నాయకులు రూ. 5లక్షల నగదును ఎమ్మెల్యేకి అందజేశారు. కార్యక్రమంలో డిఇఒ మీనాక్షి, ఎంపిపి పర్వీన్‌బాను, ఎంఇఒలు రమణ, సురేష్‌బాబు, నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి పత్తి చంద్రశేఖర్, లాయర్ రాజశేఖర్, పిట్టా ఓబుల్ రెడ్డి, టిడిపి మండల కన్వీనర్ జయచంద్ర, ఎస్ఎంసి ఛైర్మన్ శ్రీనివాసులు, శివారెడ్డి, జాకీర్‌అహ్మద్, పిట్టా రాజారెడ్డి, చాంద్‌బాషా, షబ్బీర్, అంజనప్ప, నిజాం, షాను, మండోజి ఆరిఫ్‌ఖాన్, సౌదీ నాగరాజు పాల్గొన్నారు.

తిరుమల విశిష్టతను అపవిత్రం చేయడం దుర్మార్గం : ఎంపీ

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

జగన్ పాలనలో తిరుమల లడ్డును అపవిత్రం చేయడం దుర్మార్గమని ఎంపి బికె.పార్థసారథి తెలిపారు. ఆయన శనివారం మాజీ జడ్పిటిసి పిట్టా ఓబుల్‌రెడ్డి స్వగృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ హిందూ సమాజం మహా ప్రసాదంగా భావించి ప్రసాదం తయారీ ఇతర పదార్థాలు కలపడం దుర్మార్గమన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పిట్టా ఓబులరెడ్డి, కృష్ణమూర్తి, రాజారెడ్డి, శివారెడ్డి, సాంబశివారెడ్డి, బోర్ రమణ, పిట్టా రాజారెడ్డి, పిట్టా శివశంకర్‌రెడ్డి, తుమ్మల మహబూబ్ బాషా, ఆరిఫ్‌ఖాన్, సౌదీ నాగరాజు, షాను, నిజాం, తదితరులు పాల్గొన్నారు.

బుక్కపట్నం : తిరుమల లడ్డు తయారీలో నెయ్యి కల్తీ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ టిడిపి మండల కన్వీనర్ మలిరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక తేరు కూడలిలో ప్ల కార్డులతో నిరసన తెలిపారు. నాయకులు మాట్లాడుతూ పవిత్రమైన తిరుమలలో ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సామకోటి ఆదినారాయణ, చెన్నకృష్ణ, గంగాధర్, బాలు, సయ్యద్‌బాషా, మంజు, సుధీర్, దేవిశెట్టి రామాంజి, సంజీవ రాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ 'ఇది మంచి ప్రభుత్వం'

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

అగళిలో 'ఇది మంచి ప్రభుత్వం పోస్టర్లు' పంపిణీ చేస్తున్న టిడిపి, జనసేన, బిజెపి నాయకులు

మండలంలోని టి.కుంట్లపల్లిలో శనివారం టిడిపి మండల కన్వీనర్ జయచంద్ర ఆధ్వర్యంలో చేపట్టిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ వంద రోజుల పాలనలో రాష్ట్రం, నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమలను ప్రజలకు వివరించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు, స్టిక్కర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు పిట్టా ఓబుల్‌రెడ్డి, నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి పత్తి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

హిందూపురం : పట్టణంలోని మోత్కుపల్లిలో టిడిపి మీడియా కో ఆర్డినేటర్ చంద్రమోహన్ యాదవ్ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి 'ఇది మంచి ప్రభుత్వం' కర పత్రాలు పంపిణీ చేశారు. అలాగే 9వ వార్డులో కౌన్సిలర్ మంజుల, 37వ వార్డులో కౌన్సిలర్ మహాలక్ష్మి ఆధ్వర్యంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాగేంద్ర, రవి, నాగరాజు, సచివాలయ అడ్మిన్ హరిప్రియ, సెక్రటరీలు నహీన, లక్ష్మికళ, అశ్వర్థప్ప, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

అగళి : మండలంలోని 13 పంచాయతీల్లో టిడిపి, జనసేన, బిజెపి ఆధ్వర్యంలో 'ఇది మంచి ప్రభుత్వం ' కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రజలు ఎంతో నమ్మకంతో ఇచ్చిన బాధ్యతను కూటమి ప్రభుత్వం నెరవేరుస్తూ ముందుకు సాగుతోందని తెలిపారు. అగళిలో జడ్పి టిసి ఉమేష్ ఆధ్వర్యంలో ఇంటింటికీ 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం చేపట్టి ఇళ్లకు కరపత్రాలు, స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కుమారస్వామి, నాయకులు శివ కుమార్, చిదానంద్, నందకుమార్, నాగరాజు, రంగనాథ్, కృష్ణప్ప, శ్రీరామప్ప, ఎంపిటిసి నాగరాజు, నరసింహమూర్తి, శివకుమార్, లక్ష్మీకాంత్, రమేష్, నాగరాజ్, భూతారాజు, నవీన్, మహేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

గోరంట్ల : మండలంలోని వానవోలు, బూదిలి, గోరంట్ల, ఎర్రబెల్లి గ్రామాల్లో టిడిపి నాయకులు, అధికారులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రఘునాథ్‌గుప్తా, అధికారి బాబురావు, మండల కన్వీనర్ సోమశేఖర్, నాయకులు బాలకృష్ణచౌదరి, ఈడిగ రవి ఆదినారాయణ, జయరాం, డీలర్లు శ్రీనివాసులు, రాఘవనాయుడు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మడకశిర రూరల్ : మండలంలోని జక్కేపల్లి, మెడవాయి గ్రామాల్లో టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ, సచివాలయ సిబ్బంది, నాయకులు నారాయణగౌడ, నరసింహరాజు, బాలాజీ, పార్థసారధి పాల్గొన్నారు.

తనకల్లు : మండలంలోని కొక్కంటి క్రాస్‌లో ఉన్న చంద్రబాబు కాలనీలో టిడిపి నాయకులు, సచివాలయం సిబ్బంది ఇంటింటికీ తిరిగి 'ఇది మంచి ప్రభుత్వ' కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు నాగభూషణ, మల్లికార్జున, గోవిందు, జనసేన పార్టీ మండల కన్వీనర్ కెవి.రమణ, పులికంటి నరసింహులు, పులి మహేష్, సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

పరిగి : టిడిపి మండల కన్వీనర్ గోవింద్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు, టిడిపి నాయకులు ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. కొడిగెనహళ్లి పంచాయతీలోని పెద్దిరెడ్డిపల్లిలో టిడిపి నాయకులు సోమప్ప, ప్రవీణ్‌రెడ్డి ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఇఒ లక్ష్మీదేవి, పంచాయతీ కార్యదర్శి అరుణ రంగనాథ్, సూర్యనారాయణ, సర్పంచి బాలాజీ, లక్ష్మణరావు, డిఎస్ఎల్ శ్రీనివాసులు, నాగరాజు, నాగభూషణం, కంకర శ్రీనివాసులు, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

27న చలో అనంతపురం : ఎమ్మార్పీఎస్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ఈ నెల 27వ తేదీ అనంతపురం నగరంలో ఎపి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పేరుపోగు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించే కృతజ్ఞత యాత్రను జయప్రదం చేయాలని ఎపి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంటిమద్ది ఓబులేసు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం సాయి ఆరామం లో కృతజ్ఞత యాత్ర కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి ఎజి.తిప్పయ్య, నాయకులు నరసింహులు, రజినీకాంత్, ఎంఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఆదిశేషు, నాయకులు సుందర్‌రాజు, నాగరాజు, లక్ష్మయ్య, కుమార్, అంకాలప్ప, శీనప్ప, నరసింహులు, గణేష్, రామంజి, బాబయ్య, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార మహోత్సవాలు

ప్రజాశక్తి-సోమందేపల్లి

పౌష్టికాహార మహోత్సవంలో భాగంగా శనివారం అంగన్వాడీ కార్యకర్తలు స్థానిక సాయిబాబా గుడి ఆవరణలో స్టాల్ ఏర్పాటు చేయగా మంత్రి సవిత సందర్శించారు. మంత్రి మాట్లాడుతూ ప్రభు త్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న పౌష్టికాహారాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలను సొంత కుటుంబ సభ్యుల్లా భావించి పౌష్టికాహారం అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ ఇన్‌ఛార్జి పిడి నాగమల్లేశ్వరి, సిడిపిఒ అనురాధ, సూపర్వైజర్లు శుభారాణి, రజిత, సిఐటియు జిల్లా కోశాధికారి శ్రీదేవి పాల్గొన్నారు.

గుడిబండ : మండలంలోని మోరుబాగల్ గ్రామ అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహార మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా సిడిపిఒ శాంతలక్ష్మి హాజరై పౌష్టికాహారం, బాల్య వివాహాలు, తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రాజేంద్ర, సూపర్వైజర్ కమలమ్మ, ముత్యాలమ్మ, అంగన్వాడీ టీచర్లు మంజుల, రేణుకమ్మ, సవిత, శైలమ్మ, హెల్పర్ నరసమ్మ పాల్గొన్నారు.

నార్పల : మండలంలోని దుగుమర్రి అంగన్వాడీ 1,2 కేంద్రాల్లో శనివారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ భారతి సూపర్వైజర్లు సునాలిని, మధుమాలిని, బ్లాక్ కోఆర్డినేటర్ లావణ్య , సర్పంచి శివలక్ష్మి, ఎంపీటీసీ శారదమ్మ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. సిడిపిఒ భారతి మాట్లాడుతూ పోషకాహారం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు లక్ష్మీదేవి ప్రేమలత హెల్పర్లు అరుణ లక్ష్మి పాల్గొన్నారు.

నార్పలలో డ్రైయినేజీలు శుభ్రం

నార్పల : స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలోని పలు కాలనీలోలో డ్రెయినేజీలను శుభ్రం చేశారు. స్థానిక దుగుమర్రి రోడ్డు, కొండవంక ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాలను తొలగించారు. తర్వాత పరిసరాల పరిశుభ్రతపై స్థానికులకు అవగాహన కల్పించారు. అనంతరం పంచాయతీ కార్మికులకు సేఫ్టీ కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ దివాకర్, ఇఒఆర్‌డి శైలజారాణి, పంచాయతీ కార్యదర్శులు చరణ్, పరశురాం, శ్రీనివాసులు, లక్ష్మేంద్ర, పంచాయతీ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కరించాలని వినతి

నార్పల : తాగునీటి సమస్య పరిష్కరించాలని మండల కేంద్రంలోని ఉద్దిబావి చేను వీధి కాలనీవాసులు శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ దివాకర్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ కాలనీలో మూడు నెలలుగా తాగునీటి సమస్య నెలకొందన్నారు. సమస్య పరిష్కరించాలని అధికారులకు కలిసి ఎన్నిమార్లు విన్నవించినా పరిష్కరించలేదన్నారు. వెంటనే తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరారు. ఇందుకు ఎంపిడిఒ స్పందిస్తూ కాలనీలో సమస్యను పరిష్కరించాలని పంచాయతీ అధికారికి ఫోన్‌లో ఆదేశాలు జారీ చేశారు.

ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి

ప్రజాశక్తి-అనంతపురం

ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ రమేష్‌బాబు పిలుపునిచ్చారు. ఎస్‌కెయు కాలేజీ ఆఫ్ ఫార్మాసూటికల్ సైన్సెస్ ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులు శనివారం కళాశాల ఆవరణలో ప్లాస్టిక్‌ను తొలగించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ జి.వెంకటనాయుడు, ఎస్‌కెయు ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డి.మురళీధర్‌రావు, కళాశాల ప్రిన్సిపాల్ జిజి.సోమశేఖర్, ఎన్‌వైకె సభ్యులు జీవన్‌కుమార్, ఎన్ఎస్ఎస్ పిఒ పి.సత్యసౌమ్య, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ

అనంతపురం రూరల్ : ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా అనంతపురం రూరల్ మండలం, పాపంపేట, కక్కలపల్లి కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే పరిటాల సునీత భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనంతపురం రూరల్ మండలానికి రూ.5.50కోట్లు మంజూరు అయ్యాయన్నారు. ఈ నిధుల్లో రూ.2.8 కోట్లతో సిసి రోడ్లకు భూమిపూజ, పాపంపేట పంచాయతీ, భాగ్యనగర్‌లో రూ.5లక్షలతో శుద్ధజల తాగునీటి కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనంతపురం రూరల్ తహశీల్దార్ మోహన్‌కుమార్, ఎంపిడిఒ పుల్లయ్య, టిడిపి నాయకులు పాల్గొన్నారు.